

ప్రకృతి వ్యవసాయంలో ఆధునిక సైన్స్


జిల్లాలో మెక్సికో బృందం పర్యటన

ప్రజాశక్తి- తిరుపతి టౌన్, రామచంద్రాపురం: ప్రకృతి వ్యవసాయంలో ఆధునిక సైన్స్ దాగి ఉందని, సూర్యరశ్మి, గాలి, నీరు, మొక్కలు, సూక్ష్మజీవులు, మట్టి తదితర అన్ని అంశాలు ప్రకృతి వ్యవసాయంతో ముడిపడి ఉన్నాయని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి. విజయ్ కుమార్ స్పష్టం చేశారు. రైతుల సంక్షేమమే గాకుండా ప్రజల ఆరోగ్యం, భూమి పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ఓ పరిపూర్ణ విధానంతో ఏపీసీఎన్ఎఫ్ (ఆంధ్ర ప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ) కార్యక్రమం అమలు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో రైతు సాధికారసంస్థ అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించేందుకు ఈనెల 15 నుంచి 17వ తేది వరకు మెక్సికో దేశ ప్రతినిధి బృందం తిరుపతి జిల్లాలో పర్యటించనుంది. అందులో భాగంగా ఆదివారం తిరుపతి పట్టణం లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి.విజయ్ కుమార్ పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా ఏపీ సీఎన్ఎఫ్‌తో పాటు ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమి ఫర్ ఆగ్రో ఎకాలజి రిసెర్చ్ అండ్ లర్నింగ్ సెంటర్, ద్వారా జరుగుతున్న కార్యక్రమాలను మెక్సికో ప్రతినిధి బృందంకు వివరించారు. ఈ బృందంలో మెక్సికో ప్రభుత్వ ప్రతినిధి బృందంతో పాటు ప్రజా సంస్థల తరపున పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, రైతులు కూడా ఉన్నారు. మెక్సికో ప్రభుత్వం తరపున ఏరియా డైరెక్టర్ డియాజ్ మరియా నేటివిటీ నేతృత్వంలో ఆ దేశ కేంద్ర కార్యాలయం నుంచి కమ్యూనికేషన్స్ డైరెక్టర్ రామిరేజ్ పార్డో ఎరికా సోమి, మెక్సికన్ నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధకులులో పెజ్ మెర్లిన్ డేవిడ్, నేషనల్ అసోసియేషన్ ఆఫ్ మార్కెటింగ్ కంపెనీస్ ఆఫ్ రూరల్ ప్రొడ్యూసర్స్ సంస్థ సాంకేతిక నిపుణులు ఇసైయాస్ సోలాజానో మంజానో, ఫ్రాగోసో విల్లావిసెన్సియో పాబ్లో ఈ బృందంలో ఉన్నారు. వీరితో పాటు అంతర్జాతీయ దాతృత్వ సంస్థ నౌ పార్టనర్స్ నుంచి లియోనార్డో సిల్వా డి ఆండ్రేడ్, రెన్స్కే వాన్ గ్రిన్స్వెన్‌లు కూడా పాల్గొన్నారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాన్ని విస్తరించి రాష్ట్రాన్ని రసాయన రహిత ఆంధ్ర ప్రదేశ్‌గా తీర్చి దిద్దాలని ముఖ్యమంత్రి ఎంతో చిత్తశుద్ధి కలిగి ఉన్నారని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం వల్ల రైతులకు ఖర్చు తగ్గి ఆదాయం పెరగడమే గాకుండా అనేక ఆర్థికేతర ప్రయోజనాలుకలుగుతున్నాయని అన్నారు. వతావరణ ఎమర్జెన్సీకి ప్రకృతి వ్యవసాయం ఓ పరిష్కార మార్గంగా ఉద్భవించిందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే అనేక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కార్యక్రమాన్ని శరవేగంగా విస్తరించే ప్రయత్నం చేస్తున్నామని, రాష్ట్రంలో మహిళా సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయం అమలు చేయడం వల్ల కార్యక్రమం విస్తరణ సులభతరం అవుతోందని అన్నారు. ఆర్‌వైఎస్ఎస్ సీనియర్ అధికారులు సి.చంద్రశేఖర్, కే.సురేష్ బాబు, లక్ష్మానాయక్, సుధాకర్, డాక్టర్ సందీప్, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్మగం, ఫార్మర్ సైంటిస్టులు, పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న మెక్సికో బృందం

క్షేత్ర సందర్శన...

మెక్సికో బృందం ఆదివారం మధ్యాహ్నం తిరుపతి గ్రామీణ పరిధిలోని వేమూరు గ్రామంలో డి.అయ్యప్ప నాయుడు వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన డెమో పద్ధతిలో పాల్గొని ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే బీజామృతం, ఘనజీవామృతం, ద్రవజీవామృతం, విత్తన గుళికల తయారి విధానంను ప్రత్యక్షంగా తెలుసుకొన్నారు. అనంతరం సి.రామాపురం గ్రామంలో పర్యటించి వేర్వేరు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఏడాది పొడవునా పెరటి తోటలను నిర్వహించే నిరుపేద కుటుంబాలతో చర్చించారు. అనంతరం అదే గ్రామంలో మహిళా సంఘాలు, గ్రామ ఐక్య సంఘాల ప్రతినిధులతో ముచ్చటించి మహిళా సంఘాల బాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం అమలు చేస్తున్న తీరును, మహిళల పాత్రను అడిగి తెలుసుకొన్నారు.


సెమినార్‌లో మాట్లాడుతున్న విజయ్ కుమార్

వంద రోజుల పరిపాలనలో
తారాస్థాయికి వర్గవిభేదాలు



ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుపతి ఎమ్మెల్యేగా గతంలో టీడీపీ నుంచి సుగుణమ్మ పోటీ చేసారు. 2019 ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి గెలుపు స్వల్పంగా మారింది. ఈ నేపథ్యంలో ఆమె గెలుపు అమ్మకానికి మారిందనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. 2024 ఎన్నికల్లో ఆ అంశం ప్రధానంగా తీసుకున్న టీడీపీ అభ్యర్థి ఎంపికలో కొంచెం గందరగోళం నెలకొంది. చిత్తూరు నుంచి వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న ఆరణి శ్రీనివాసులు అనూహ్యంగా చిత్తూరు వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరారు. తిరుపతి సీటు జనసేనకు అప్పగించినట్లు చంద్రబాబు నాయుడు ప్రకటించడంతో కొంత మంది నాయకులు సైతం జనసేన వైపు చూసిన అప్పటికే జనసేన తిరుపతి సీటును ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న ఆరణి శ్రీనివాసులకు కట్టబెట్టింది పార్టీ. అనుకోని పరిణామంతో కూటమి పార్టీలు కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తూ సమావేశాలు నిర్వహించారు.. కులాల వారీగా చర్చలు చేసారు.. అసమ్మతి వర్గం మొత్తం ఒక్కటిగా మారిపోయింది. ఈ పరిణామంతో గెలుపు సంగతి అటుంచి ప్రచారం సైతం పోలేని పరిస్థితికి ఎమ్మెల్యే అభ్యర్థి చేరుకోవడంతో పవన్ కళ్యాణ్ రంగంలోకి దిగి అసమ్మతి వర్గాలను శాంతింపజేసి అందరిని ఒక తాటిపైకి తీసుకొచ్చారు.

నాటి నుంచి వ్యతిరేక వర్గాలు..

తిరుపతి ఎమ్మెల్యే సీటు ప్రకటించిన నాటి నుండి జనసేన, టీడీపీ లోని కొంత మంది నాయకులు కూటమి నిర్ణయంపై వ్యతిరేక స్వరం వినిపించారు. పార్టీ ప్రకటించిన అభ్యర్థిని మార్చి స్థానికులకు ప్రధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే పార్టీల నిర్ణయం మేరకు అందరూ కలిసి ప్రచారం చేసి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అభ్యర్థిని 60వేల మెజారిటీతో గెలిపించారు. పార్టీ గెలుపు తరువాత 100 రోజులు కాలం గడవకముందే పార్టీలో వర్గ విబేధాలు తారాస్థాయికి చేరుకున్నాయి.

నామినేటెడ్ పదవి ఇచ్చి

రాష్ట్ర వ్యాప్తంగా నామినేటెడ్ పోస్టుల కోసం నాయకులు ఎదురుచూస్తున్నారు. పార్టీ కోసం కష్టపడి కేసులు పెట్టించుకుని ఐదేళ్ల పాటు ఇబ్బందులు పడిన వారు ఎందరో తమకు పోస్టు వస్తుందని ఎదురుచూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తిరుపతిలో ఎమ్మెల్యే సహకారంతో తిరుపతి రుయా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడి నామినేటెడ్ పోస్టు ఇవ్వడంపై తిరుపతి జనసేన నాయకులు మధ్య వివాదం బయటపడటానికి కారణమైంది. ఎన్నికల ముందు వరకు వైసీపీలో ఉన్న బండ్ల లక్ష్మీపతి రాయల్ అనే వ్యక్తికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సిఫార్సుతో కమిటీ సభ్యులుగా తెచ్చుకోవడం పట్ల జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు సీనియర్లను పక్కన పెట్టి వైసీపీ నుంచి వచ్చిన వారికి సీట్లు ఇవ్వడం పట్ల ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ఆయన తన నివాసానికి రావాలని జనసేన పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జి కిరణ్ రాయల్, వారి మద్దతుదారులను పిలిచారు. బుధవారం రాత్రి అందరూ ఎమ్మెల్యే నివాసానికి చేరుకున్నారు. అయితే ఎమ్మెల్యే లేకపోవడం.. తిరిగి వెళ్లిపోవాలని నిర్ణయం తీసుకుని బయటకు వచ్చేసారు. అదే సమయంలో ఎమ్మెల్యే వర్గం.. కిరణ్ రాయల్ వర్గంలోని కొందరు మాటమాట పెంచుకుని తోపులాట, దాడి జరిగింది. దీంతో అక్కడ ఉన్న వారు సర్దిచెప్పి పంపేసారు. ఈ పంచాయితీ జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వరకు చేరినట్లు సమాచారం.

కిరణ్ రాయల్ వివరణ

"పార్టీలో ఇటివల జరిగిన కొన్ని పరిణామాలపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో చర్చించేందుకు జనసేన నేతలతో కలిసి వెళ్లాం. ఎమ్మెల్యే లేకపోవడంతో తిరిగి వస్తుండగా అటువైపు వెళుతున్న కొందరు వైసీపీ ఆకతాయిలు మా నేతలపై దాడి చేసారు. మేము వారిపై దాడులు చేసినట్టు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. తమ మధ్య విభేదాలు సృష్టించేందుకు వైసీపీ నేతలు కుట్ర చేస్తున్నారు" అని కిరణ్ రాయల్ అన్నారు.

వెలుగులో బయటపడ్డ అవినీతి
రూ.1.60 కోట్లు స్వాహా

- ఇద్దరు సంఘమిత్రలు సస్పెన్షన్

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి : తొట్టంబేడు వెలుగుశాఖలో జరిగిన ఆర్థిక కుంభకోణమొకటి ఆదివారం ఆలస్యంగా వెలుగు చూసింది. రూ.1.60కోట్ల ప్రజల సొమ్మును దుర్వినియోగం చేయడంతో ఇద్దరు సంఘమిత్రులను విధుల నుంచి అధికారులు తొలగించారు. వివరాల్లోకి పోతే.. తొట్టంబేడు మండలం చియ్యవరం పంచాయతీలో పొదుపు సంఘాల బ్యాంకు రుణాల చెల్లింపుల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయని ఏపీఎం గురుమూర్తికి ఫిర్యాదు అందింది. ఆ మేరకు ఆయన ఆదివారం హుటాహుటిన గ్రామంలో విచారణ చేపట్టగా 56 పొదుపు సంఘాల నుంచి క్రమం తప్పకుండా బ్యాంకు రుణ ఖాతాకు జమ కావాల్సిన రూ.1.60 కోట్ల నగదు పక్కదారి పట్టినట్లు గుర్తించారు. ఈ విషయంపై సదరు సంఘమిత్రలను గ్రామ సచివాలయానికి పిలిపించి గ్రామస్తుల సమక్షంలోనే విచారించగా వారు చేసిన నేరాన్ని అంగీకరించారు. వారి వద్ద నుంచి ఆ సొమ్మును రికవరీ చేసుకునేందుకు గడువు నివ్వడంతో పాటు అవినీతికి పాల్పడ్డ సంఘమిత్రలు మునిశేఖర్, మునిలక్ష్మిలను అక్కడికక్కడే విధులు నుంచి తొలగించారు. ఇదిలా ఉండగా 2019 నుంచి చియ్యవరం పొదుపు సంఘాల నుంచి సక్రమంగా బ్యాంకు రుణాలు చెల్లించడం లేదని తెలిసినా సదరు వెలుగు శాఖా అధికారులు, బ్యాంకు అధికారులు పట్టించుకోకపోవడం వెనక కుట్ర కోణం ఉందనే విమర్శలు వస్తున్నాయి. వీరందరికీ కూడా ఈ ఆర్థిక కుంభకోణంలో వాటా ఉందని ఆరోపణలు వస్తున్నాయి. ప్రతి మూడు నెలలకోసారి బ్యాంకర్లు, వెలుగుశాఖ అధికారులు సంయుక్తంగా పొదుపు సంఘాల బ్యాంకు ఖాతాలపై ఆడిట్ నిర్వహిస్తూ ఉంటారు. ఈ క్రమంలో ఇంత పెద్ద మొత్తంలో గ్రూపు నుంచి రుణాలు కట్టకుండా ఉంటే సదరు అధికారులు ఏం చేస్తూ ఉన్నారన్న ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. ఈ అంశంపై కూడా ఉన్నతాధికారులు విచారణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


సంఘ సభ్యులను విచారిస్తున్న ఏపిఎం గురుమూర్తి

వేలం డబ్బులు ఏవీ.. వినాయక..?

- రూ.10 లక్షల పాట
- కార్పొరేషన్‌కి చెల్లించని కాంట్రాక్టర్


వేలంపాట (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: వినాయక నిమజ్జనం చేసేముందు లడ్డు వేలం వేసి పాటపాడిన వారి నుంచి వారి వద్ద డబ్బులు తీసుకుని లడ్డు ప్రసాదాలు ప్రసాదం ఇచ్చేవారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వినాయక చవితి సందర్భంగా పెద్ద విగ్రహం ఏర్పాటు చేసి ప్రతిరోజు పూజలు చేసి మూడవరోజు లడ్డు వేలం వేసి ఎవరైతే పాట ఎక్కువ పాటు తీసుకుంటారు వారికి లడ్డు ప్రసాదాలు ఇచ్చేవారు. తర్వాత పాట పాడిన వారి దగ్గర నుంచి వేలంలో నుంచి వచ్చిన డబ్బులు కార్పొరేషన్ ఖజానాకు జమ చేసేవారు. 2022 సంవత్సరంలో లడ్డు వేలం వేశారు. అప్పటి వైసిపికి చెందిన ఓ రాజకీయ నేత లడ్డు వేలం రూ.7 లక్షలకు పాట పాడి లడ్డు ప్రసాదాలు తీసుకున్నారు. అయితే ఆ డబ్బులు కార్పొరేషన్ ఖజానాకు చేరిందా.. లేదా.. అనేది మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు సందేహాలు వస్తున్నాయి. వేలంలో వచ్చిన డబ్బులు ఏమైందని పలువురు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. అప్పట్లో కమిషనర్ కూడా వేలంలో వచ్చిన డబ్బులు కార్పొరేషన్ లేదా అని అడగలేదని తెలుస్తుంది. తర్వాత 2023 సంవత్సరంలో లడ్డు వేలం వేశారు. రూ.11 లక్షలు పాట పాడి వైసిపికి చెందిన ఒక కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. లడ్డు ప్రసాదం మాత్రం తీసుకోవడం జరిగింది కానీ కార్పొరేషన్‌కి ఇప్పటివరకు వేలంలో పాడిన డబ్బులు ఇంతవరకు చెల్లించకపోవడం విశేషం. మొన్న జరిగిన వినాయక చవితి పండుగ సమయంలో ఈ అంశంపై కాంట్రాక్టర్‌ను వేలంలో పాడిన డబ్బులు ఇవ్వాలని జరిగింది. అయితే ఆ కాంట్రాక్టర్ తనకు కార్పొరేషన్ కార్యాలయం నుంచి మూడు కోట్ల రూపాయలు బిల్లులు రావాల్సి ఉందని, మూడు కోట్ల రూపాయలు బిల్లులు అధికారులు చెల్లిస్తే తాను వేలంలో పాట పాడిన రూ.11 లక్షలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని సమాధానం చెప్పి దాట వేశారు. ఏడాది అయితే కాంట్రాక్టర్ వేలం డబ్బులు ఇవ్వలేదని బహిర్గతమైంది. ఇటీవల జరిగిన వినాయక చవితి పండుగ కార్పొరేషన్ పెద్ద విగ్రహం పెట్టి ఘనంగా నిర్వహించారు. ఈసారి లడ్డు వేలం నిర్వహించారు. మూడు లక్షల పదివేల రూపాయలు మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు పాట పాడి దక్కిస్తున్నారు. అయితే వారు కూడా ఈ డబ్బులు ఇస్తారా లేదా అన్న అనుమానాలు పలువురు వ్యక్తం చేస్తున్నారు. మూడు లక్షల పదివేల రూపాయలు కార్పొరేషన్ ఖజానాకు ఇంజనీరింగ్ అధికారులు తమ సొంత డబ్బు అయినా ఇచ్చుకోవాల్సి వస్తుంది.. లేదంటే పలువురు కాంట్రాక్టర్ దగ్గర వసూలు చేసిన ఇవ్వాలని అధికారులు భావిస్తున్నారు. ఏది ఏమైనా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నిమజ్జనం సమయంలో లడ్డు వేలం డబ్బులు మాత్రం కార్పొరేషన్ ఖజానాకు సకాలంలో చేరడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.


నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఈద్ మిలాద్ ఉన్ నబీ ప్రభుత్వ సెలవు దినం కావడం వలన ఈనెల 16వ తేది సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని రద్దు చేసామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సోమవారం వినతులతో రావొద్దని, రానున్న సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తామని తెలిపారు.

జిల్లాలో పలువురు డీఎస్పీలు బదిలీ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ : రాష్ట్రవ్యాప్తంగా పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ డిజిపి ద్వారకా తిరుమలరావు ఆదివారం ఉత్తరంలో జారీ చేశారు. ఈ మేరకు తిరుపతి జిల్లాలో సైతం పలువురు డీఎస్పీలను బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న డిఎస్పి ఎం.రాజగోపాల్ రెడ్డిని తిరపతి పోలీస్ ట్రైనింగ్ సెంటర్(పిటీసి) డీఎస్పీగా బదిలీ చేశారు. ఏసీబీ డీఎస్పీ వి.గిరిధర్‌ను తిరుపతి స్పెషల్ బ్రాంచ్‌కు, సిఐడి డీఎస్పీ ఎనుగంటి శ్రీనివాసరావును రేణిగుంట ఎస్‌డిపిఓగా, పల్నాడు ఉమెన్ పోలీస్ స్టేషన్ డిఎస్పీగా పని చేస్తున్న బి.ప్రసాదును చంద్రగిరి ఎస్‌డిపిఓగా బదిలీ చేస్తూ ఆదేశాల జారీ చేశారు. ఈ మేరకు ఒకటి రెండు రోజుల్లో వారు ఆయా స్థానాల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

చెంగాలమ్మ సేవలో చాగంటి...



ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని చాగంటి కోటేశ్వర రావు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకొని పూజలు నిర్వహించారు. వారిని ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్.శ్రీనివాస బాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం ఏర్పాటు చేసి అనంతరం పూజలు నిర్వహించారు. తదుపరి వేదపండితులచే ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు ఆకుతోట రమేష్, మన్నెముద్దు పద్మజ, ఐత శ్రీధర్, కాకి శ్రీరామమూర్తి, మన్నెముద్దు పద్మజ, పాల్గొన్నారు.

లగడపాటి సాహితీ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తెలుగు భాషా సాహిత్యాలకు తన రచనలతో ఇతరులకు ఆదర్శంగా నిలిచిన సాహితీ వేత్త లగడపాటి భాస్కర్ సేవలు చిరస్మరణీయమని పలువురు కవులు, రచయితలు కొనియాడారు. ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళా వేదిక- శ్రీకాళహస్తి అధ్యక్షులు, కవి, రచయిత లగడపాటి భాస్కర్ ప్రథమ వర్థంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లగడపాటి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయనతో గల అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ కవితల రూపంలో సాహితీ నివాళి అర్పించారు. అనంతరం ఆయన కుమార్తెలు కిరణ్మయి, కృష్ణ శశిలు కవులు, రచయితలను సత్కరించారు. ఈసందర్భంగా లగడపాటి భాస్కర్ సంస్మరణ సంచికను జనవరిలో తీసుకురావడంతో పాటు, ప్రతి ఏటా లగడపాటి భాస్కర్ సాహితీ పురస్కారాలు ఇద్దరికీ అందించనున్నట్లు తీర్మానించారు. వేదిక ప్రతినిధులు గొడుగుచింత గోవిందయ్య, యువశ్రీ మురళి, తీగల వెంకటయ్య, గురునాధం, పెళ్ళకూరు మునిసుబ్బారెడ్డి, రవీంద్ర, మోహన్ నాయుడు, వెంకటస్వామి, చెంచుకృష్ణ పిళ్ళై,షన్ముగం, మునస్వామి, బాలముని శివకుమార్, లక్ష్మీనారాయణ, దేవ, సరస్వతి, భాస్కర్ పాల్గొన్నారు.

ఏచూరికి నివాళి అర్పించిన సిఐటియు


రేణిగుంటలో..

ప్రజాశక్తి- రేణిగుంట: రేణిగుంట సిఐటియు మండల కమిటీ సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు రేణిగుంట జిఎంవీధి ఆఫీసులో అంగన్వాడీ కార్యకర్త ధనమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కందారపు మురళి హాజరయ్యారు. ఈ సమావేశంలో సిపిఎం జాతీయ కార్యదర్శి కామ్రేడ్ సీతారం ఏచూరి చిత్రపటానికి కందారపు మురళి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం సిఐటియు రేణిగుంట మండల సమన్వయ కమిటీ కన్వీనర్‌గా కె. హరినాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అంగన్వాడీలు భాగ్యలక్ష్మి, నంది పాలిమర్స్ యూనియన్ రామిరెడ్డి, పద్మనాభం, ఆటో యూనియన్ నాయకులు రవి, పురుషోత్తం, శేఖర్, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు కోటి, మణి, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు శివానందం, సిఐటియు నాయకులు నరసింహారెడ్డి, సెల్వరాజ్, వెంకటరమణ, శ్రామిక మహిళా నాయకురాలు సత్యశ్రీ, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

డక్కిలి: మండల కేంద్రంలో ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో సీతారం ఏచూరికి సంతాపం తెలియజేసి నివాళులు అర్పించారు. సిపిఎం వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ ఏచూరి లేని లోటు కమ్యూనిస్టు ఉద్యమానికి ప్రజాతంత్ర, లౌకికవాద ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సిహెచ్ రమణయ్య, పెంచలయ్య, డివైఎఫ్ఐ నాయకులు దొరబాబు, ధనంజయ, ప్రకాష్, తిరుమల,నారాయణ భవన నిర్మాణ కార్మికులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధునికి పట్టువస్త్రాల సమర్పణ



ప్రజాశక్తి- తిరుపతి సిటీ

కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం టిటిడి తరపున ఈవో జె.శ్యామల రావు పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రతి ఏడాదీ బ్రహ్మోత్సవాల్లో పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న టిటిడి ఈవోకు ఆలయ ఈవో గురుప్రసాద్, ఏఈవో విద్యాసాగర్, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయ ప్రదక్షిణం చేసి గర్భాలయంలో స్వామివారికి వస్త్రసమర్పణ చేశారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ ఈ సందర్భంగా టీటీడీ ఈఓ ను కలసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అడవుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

జంతువుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు
జిల్లా అటవీశాఖ అధికారి సతీష్ రెడ్డి

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం)

శేషాచలం అడవుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక ద్వారా ముందుకెళ్తున్నామని జిల్లా అటవీ శాఖ అధికారి సతీష్‌రెడ్డి తెలిపారు. శేషాచలం అడవులలో పెరుగుతున్న జంతువుల సంతతికి తగ్గట్టుగా ఎటువంటి సంరక్షణ చర్యలు తీసుకుంటున్నారు. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలను గ్లోబల్ టెండర్లు ద్వారా అమ్మకాలు జరపడానికి తీసుకున్న ప్రతిపాదనలపై, తిరుమల కాలినడక మార్గంలో చిరుతపులుల సంచారానికి అడ్డుకట్ట వేస్తూ శాశ్వత ప్రతిపాదికన భక్తుల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై జిల్లా అటవీ శాఖ అధికారి ప్రజాశక్తితో మాట్లాడారు.

ప్రజాశక్తి: తిరుమల కాలినడక మార్గంలో చిరుతల దాడుల నుండి భక్తులకు శాశ్వత చర్యలు చేపట్టారా?

అధికారి: తిరుమలకు వచ్చే వేలాది మంది భక్తులు కాలినడక మార్గం ద్వారా తిరుమలకు వెళ్లే క్రమంలో చిరుత పులుల సంచారం వలన భక్తులకు ఎటువంటి హాని కలగకుండా శాశ్వత చర్యలను తీసుకోవడానికి చర్చలు జరుగుతున్నాయి. వైల్డ్ లైఫ్ అథారిటీ ఆఫ్ ఇండియా సూచనల మేరకు ఇప్పటికే పలుమార్లు టీటీడీ అధికారులతో చర్చించడం జరిగింది. శాశ్వత ప్రతిపాదికన వైల్డ్ లైఫ్ అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధనల మేరకు త్వరలోనే శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తాం.

ప్రజాశక్తి: శేషాచలం అడవుల అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

అధికారి: తిరుపతి జిల్లా పరిధిలో ఉన్న శేషాచల అటవీ భూభాగాన్ని మరింతగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. అడవుల సంరక్షణ కోసం సిబ్బంది అనేక రూపాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. అడవులలో కార్చిచ్చులు ఏర్పడకుండా ఫైర్ వాల్స్ ఏర్పాటు చేశాం.

ప్రజాశక్తి: శేషాచలం అడవులలో జంతు సంరక్షణ చర్యలు గురించి వివరించండి?

అధికారి: తిరుపతి జిల్లా పరిధిలోని శేషాచలం అడవులలో జంతువుల సంరక్షణకు ప్రత్యేక ప్రణాళికలు ఇప్పటికే అమలు చేస్తున్నాం. జననివాస ప్రాంతాలకు సమీపంలోని అడవుల నుంచి జంతువులు కాలనీల వైపు రాకుండా కందకాలను తవ్వాము. అటవీ గ్రామాల సమీపంలో ఉన్న పంట పొలాల్లో అడవిపందులను వేటాడడానికి విద్యుత్తు వైర్లను, ఉచ్చులను వేటగాళ్లు ఏర్పాటు చేస్తే వన్యప్రాణి చట్టం ప్రకారం కఠినచర్యలు తీసుకుంటున్నాము. గతంలోనూ ఎర్రచందనం స్మగ్లర్లు ఓ వన్యప్రాణి చంపి అధికారులకు పట్టుబడ్డారు. వారిపై కూడా ఎర్రచందనం కేసులతోపాటు వన్యప్రాణి చట్టం ప్రకారం కూడా కేసులు నమోదు చేయడం జరిగింది.


జిల్లా అటవీ శాఖ అధికారి సతీష్‌రెడ్డి

ప్రజాశక్తి: ఎర్రచందనం దుంగల గ్లోబల్ టెండర్లకు ప్రతిపాదనలు చేశారా?

అధికారి: వివిధ రూపాల్లో శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్, అటవీ శాఖ ఆధ్వర్యంలోని బృందాలు ఎప్పటికప్పుడు స్మగ్లర్ల ఆటలను కట్టిస్తూ విలువైన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడం జరుగుతోంది. అయితే గతంలో సీజ్ చేయబడిన ఎర్రచందనం దుంగలను గ్లోబల్ టెండర్లు ద్వారా విక్రయాలు చేసామన్నారు. ఈ విక్రయాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. అయితే కరోనా తరువాత ఎర్రచందనం గ్లోబల్ టెండర్స్ పిలుపుకోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము.

చిట్టిబాబుకు జాతీయ అవార్డు ప్రదానం

ప్రజాశక్తి-రామచంద్రపురం (తిరుపతి రూరల్): ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు రూరల్ యాక్షన్ సంస్థ ఆర్గనైజర్, ట్రాయ్ కాగ్ సభ్యులు పి.చిట్టిబాబుకు సోమరాజు ఫౌండేషన్ భారత సేవా రత్న జాతీయ అవార్డును ప్రదానం చేసింది. ఈయన తెలుగు రాష్ట్రాల్లో టెలికాం వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు గ్రామీణ మహిళలఅభ్యున్నతికి చేతి వృత్తులపై శిక్షణ అందించడం, విద్యాభివృద్ధి తోడ్పాటు అందించడం, కోవిడ్ సమయంలో పౌష్టికాహారాన్ని అందించి ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించారు. ఆయన సేవలను గుర్తించిన సోమరాజు ఫౌండేషన్ అవార్డును ప్రకటించింది. కాగా బెంగళూరులోని జక్కు గ్రీన్ సిటీలో ఆదివారం ఫౌండేషన్ ఛైర్మన్ శివరామరాజు, కేంద్ర న్యాయ శాఖ మంత్రి సెక్రటరీ శివనాగేశ్వర



అవార్డు అందుకుంటున్న చిట్టిబాబు

రావు, కర్ణాటక హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణల చేతుల మీదుగా అందుకున్నారు. ఈయనను స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు, భూపతి, రవి, అమర్నాథ్, మునికృష్ణ, సిబ్బంది పద్మావతి, సురేష్, తేజ, రాజకుమారి, శాలిని, అర్కకుమార్ అభినందనలు తెలిపారు.

రచయిత్రి ఉషారాణికి..

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: మండలంలోని భాకరాపేటకు చెందిన రచయిత్రి ధనాసి ఉషారాణి రాధాకృష్ణ నేషనల్ అవార్డు అందుకున్నారు. తిరుపతికి చెందిన కలామ్ యువతేజ ట్రస్ట్ వారు ఈ అవార్డుకు ఈమెను ఎంపిక చేశారు. 150 మందిలో విద్య సాహిత్య రంగంలో చేసిన విశిష్ట సేవలకు, ధనాసి ఉషారాణి ప్రతిభను


అవార్డు అందుకుంటున్న ఉషారాణి

కనపరిచినందుకు గురుదేవోభవ జాతీయ పురస్కారంకు ఎంపిక చేశారు. జీవకోనలోని విశ్వం పాఠశాలలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును ముఖ్య అతిథిలు పూర్వ ఉపకులపతి కంకణాల రత్నయ్య, ప్రముఖ రచయిత ప్రిన్సిపల్ నారాయణస్వామి, యువతేజం ట్రస్ట్ చైర్మన్ కరీముల్ల చేతులు మీదుగా మెమెంటో, సర్టిఫికేట్‌ను అందించారు.

నడకతో సంపూర్ణ ఆరోగ్యం

- డాక్టర్ ఆర్ముగం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నడకతో పలు వ్యాధుల నుంచి సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని చిన్నపిల్లల వైద్యానిపుణులు డాక్టర్ ఆర్ముగం తెలిపారు. ఆదివారం పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ భవనంలో వాకర్స్ అధ్యక్షులు కేవీఎల్ మూర్తి, ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ ఆర్ముగం, డాక్టర్ రవిరాజు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉదయం లేవగానే నడక చేసి వ్యాయామం చేయాలని, షుగర్, బిపి వంటి దీర్ఘకాలిక


డాక్టర్ రవిరాజును సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

వ్యాధులను కొంతవరకు నివారించుకోవచ్చని సూచించారు. పలు ఆరోగ్య సూత్రాలను వివరించారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో ముని కృష్ణయ్య, మాధవ నాయుడు, రఫీ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భారత్ టెక్ లీగ్ జోనల్ ఈవెంట్

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో భారత్ టెక్ లీగ్ జోనల్ ఈవెంట్‌ను ఇంజనీర్స్ డే సందర్భంగా ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎస్‌వో కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆదిశంకర కళాశాలలో భారత ప్రభుత్వ సహకారంతో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులు సైన్స్ కాంగ్రెస్, ఇన్స్పైర్ వంటి కార్యక్రమాల్లో పాల్గొని అవిష్కారణలు ప్రదర్శించేందుకు ఈ ల్యాబ్ ఎంతో దోహద పడుతుందన్నారు. విద్యార్థులు చిన్న తనం నుండే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకొని ఎదగాలన్నారు. ప్రతిభ కనపరిచిన వారికి 22న విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వ విద్యాలయంలో నిర్వహించనున్న నేషనల్ ఈవెంట్‌కు పంపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ వేణు మాధవ్, ఇమ్మ ను యెల్, వంశీ అనూష, రామయ్య, ప్రదీప్, కార్తీక్, లోకేష్ పాల్గొన్నారు.

ఘనంగా దక్షిణ భారతీయ సంగీత నృత్యోత్సవాలు


కళాకారుల నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ సాయి నటరాజ ఆర్ట్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో ఎస్వీ సంగీత, నృత్య కళాశాల వేదికగా దక్షిణ భారతీయ సంగీత నృత్యోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అనేక బృందాలు చేసిన భరతనాట్యం, కూచిపూడి, శాస్త్రీయ సంగీతం, జానపద నృత్యాలతో ఆద్యంతం ప్రేక్షకులను విశేషంగా అలరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్వీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమ ముద్దుబాల, ప్రఖ్యాత భరతనాట్యం గురువులు లెక్చరర్ హెచ్‌ఓడి డాక్టర్ కె.దేవేంద్ర పిళ్లై, కూచిపూడి విభాగాధిపతి డాక్టర్ ఉషారాణి, విశ్వం స్కూల్స్ డైరెక్టర్ విశ్వచందన్ రెడ్డి, శ్రీ సాయి నటరాజ అకాడమీ డైరెక్టర్ శరత్ చంద్ర 120మంది నాట్య కళాకారులకు కూచిపూడి, భరతనాట్యం ప్రతిభ అవార్డ్‌తో, గురువులకు గురు శ్రేష్ఠ అవార్డుతో సత్కరించారు.

అంగరంగ వైభవంగా గణనాథుని నిమజ్జనం



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణనాథ విగ్రహ నిమజ్జన మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణంలో భారీ వినాయక స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసి, వినాయక చవితి వేడుకలను 9 రోజులపాటు విశేష పూజలతో ఘనంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆధ్వర్యంలో రోజుకు ఒక పోలీస్ స్టేషన్ విభాగం చొప్పున వరుసగా ఈస్ట్, తిరుచానూరు, తిరుపతి రూరల్, రేణిగుంట సబ్ డివిజన్, తిరుపతి ట్రాఫిక్, సిసిఎస్ తిరుపతి అండ్ మహిళా పోలీస్ స్టేషన్, జిల్లా పోలీస్ కార్యాలయం అండ్ డిసిఆర్బి, స్పెషల్ బ్రాంచ్, జిల్లా సాయుధ దళాల బాధ్యత తీసుకుని మొక్కవోని దీక్షతో నిర్విఘ్నంగా వేద పండితుల సమక్షంలో వినాయక విగ్రహానికి ప్రతి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పోలీసులు, కార్యాలయ సిబ్బంది, అధికారులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఆదివారం వినాయక నిమజ్జనాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎస్పీ సుబ్బారాయుడుతో పాటు కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరాచారి, నాగభూషణ రావు, శ్రీనివాసరావు సాయుధ దళం, డీఎస్పీలు వెంకటనారాయణ, నరసింగప్ప, రామక్రిష్ణ చారి, రవీంద్రారెడ్డి, రమణయ్య, చిరంజీవి, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

డాక్టర్ యువశ్రీకి ఆచార్యదేవోభవ జాతీయ పురస్కారం

ప్రజాశక్తి-క్యాంపస్: భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 137వ జన్మదిన వేడుకలు, ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా యువతేజం ట్రస్ట్, తిరుపతి, కలాం విజన్, న్యూ ఢిల్లీ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన విశ్వం విద్యాసంస్థలు, తిరుపతి వేదికగా జాతీయ స్థాయిలో పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం, తెలుగు అధ్యయన శాఖలో సహాయాచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ డి.యువశ్రీకి ఆమె విద్యారంగంలో చేస్తున్న సేవలకు, కృషికి గానూ 2024 సంవత్సరానికి ఆచార్యదేవోభవ జాతీయ పురస్కా



రాన్ని అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ మనుమడు డాక్టర్ జి.సుబ్రహ్మణ్యం శర్మ, ద్రావిడ విశ్వ విద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య కంకణాల రత్నయ్య, డాక్టర్ ఎస్.కె. కరీముల్లా, డాక్టర్ నారాయణ స్వామి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-రేణిగుంట: రేణిగుంటలోని విమానాశ్రయం సమీపంలో గల గురుకుల పాఠశాలను ఆదివారం ఏపీ ఎస్టి కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పాఠశాలలోని తరగతుల గదులను విద్యార్థుల నైపుణ్యాన్ని అడిగి తెలుసుకుంటూ మమేకమయ్యారు. భోజనశాల, పడక గదులను, తాగునీరు, మరుగుదొడ్లను పరిశీలించి లోటుపాట్లు గురించి ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పిల్లలకు మెరుగైన విద్యను అందించాలని సూచించారు. పేదరికంతో నివాసాలను వదిలి హాస్టల్లో చదువుకునే విద్యార్థులు విద్యను గొప్పగా అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. వారికి ఎటువంటి సమస్యలు ఉన్న వెంటనే తమ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. పాఠశాలలోని లోటుపాట్లు సరిదిద్దుకోవాలని ఇలాగే కొనసాగితే ప్రభుత్వం ద్వారా చర్యలను తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిటిడబ్ల్యూఓ సూర్యనారాయణ, ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ హరిబాబు, స్కూల్ కమిటీ ఛైర్మన్ కుప్పం రాజేష్, టీచర్స్ మోహన్ బాబు, ఉమాదేవి, రజని, రాధా బాయ్, పద్మ, అన్నపూర్ణ, అంజి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అభివృద్ధి పనుల తనిఖీ

ప్రజాశక్తి-రేణిగుంట: సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ నాగ్య నాయక్ రేణిగుంట, తిరుపతి స్టేషన్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ రేణిగుంట బ్రాంచ్ వారు నాగ్య నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి



జయంత్‌కుమార్, వైస్ ఛైర్మన్ ఆర్ఎస్ జ్ఞాన శేఖర్, వెంకటేశ్వర్లు, రవి, విజయ్‌కుమార్, తిమ్మారెడ్డి, రవీంద్రన్, శేషాద్రి పాల్గొన్నారు.

జర్నలిస్టులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

- డాక్టర్ మధు కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి మంగళం, తిరుపతి టౌన్: సమాజంలో కీలకమైన జర్నలిస్టులు వృత్తిపరంగా అనేక ఒడిదుడుకులు, మానసిక పని ఒత్తిడితో విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని, ఈ క్రమంలో జర్నలిస్టులు వారి ఆరోగ్యంపై శ్రద్ధ పెంచుకోవాలని డిబిఆర్ అండ్ ఎస్‌కె హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ మధు కృష్ణారెడ్డి సూచించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో మెగా మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు, వారి కుటుంబ సభ్యులకు నిర్వహించిన వైద్య పరీక్షల్లో కొన్ని ఆరోగ్య సమస్యలను గుర్తించామని, తమ హాస్పిటల్లో ఇందుకు ఉచితంగా వైద్యాన్ని అందిస్తామని ప్రకటించారు. ప్రెస్‌క్లబ్ కమిటీ కార్యదర్శి బాలచంద్ర



మధు కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ప్రెస్ క్లబ్ కమిటీ, సభ్యులు

మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో గడిచిన రెండేళ్ల కాలంలో వివిధ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా మెగా మెడికల్ క్యాంపు నిర్వాహనకు ముందుకు వచ్చిన డిబిఆర్ అండ్ ఎస్‌కె హాస్పిటల్ వైద్యులకు ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో చిరు సత్కారాన్ని అందించారు. ఈ మెగా మెడికల్ క్యాంపులు వైద్యులు తులసీరామ్, వెంకటేష్, యుగంధర్, ప్రవీణ్, స్వప్న, ప్రెస్‌క్లబ్ కోశాధికారి శ్రీకాంత్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి-క్యాంపస్: 2024-2025 విద్యా సంవత్సరానికి జరిగిన జవహర్ నవోదయ విద్యాలయ 6, 11వ తరగతి మూడో జాబితా ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విశ్వం విద్యార్థులు రెడ్డి చరణ్ రెడ్డి, కొమల్ కుమార్, గణేష్, మహేష్, యామిని, సంతోష్, చేతన్ రెడ్డి, హరి చరణ్‌లు సీట్లు సాధించి విజయభేరి మోగించారు. వీరితో పాటు మొత్తం 59మంది విద్యార్థులు సీట్లు సాధించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథ రెడ్డి తెలిపారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

20లోపు ఫీజు చెల్లించాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ ఇన్ సిటీ స్టడీ సెంటర్లో చదువుతున్న విద్యార్థులు సెకండ్ సెమిస్టర్ పరీక్షలు ఫీజు చెల్లించుటకు ఈనెల 20వ తేదీ ఆఖరు అని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ టి.నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలాగే ద్వితీయ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజ్ చెల్లించుటకు ఈనెల 30వ తేదీ చివరి తేదీ అని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9515401088, 7382929641లను సంప్రదించాలన్నారు.

అపూర్వ కలయిక


శ్రీకాళహస్తిలో

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: భాస్కర్ పేట మున్సిపల్ హైస్కూల్లో 1996-97 ఏడాది పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం దక్షిణ కైలాస నగర్‌లోని సీఎం ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ గత జ్ఞాపకాలను స్మరించుకుంటూ మధుర స్మృతులను ఒకరికొకరు పంచుకున్నారు. ప్రస్తుతం వారు పనిచేస్తున్న రంగాలను పరిచయం చేసుకున్నారు. మున్సిపల్ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సాయం చేసేందుకు తీర్మానించుకున్నారు. అనంతరం తమకు చదువులు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ది శ్రీకాళహస్తి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బొమ్మన మధు సూదన్ రావు, స్మార్ట్ గయ్స్ అధినేత గంజీ సుబ్బారాయులు, చంద్ర, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.


పుత్తూరులో

పుత్తూరు టౌన్: పట్టణంలోని స్థానిక ఎస్ఆర్ఎస్ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం 1983-84 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పోతుగుంట విజయబాబు మాట్లాడుతూ.. విద్యార్థులు తమ జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను విస్మరించకూడదని తెలిపారు. గురువులను గౌరవించడం భారతీయ సంస్కృతిలో ఒక భాగమని సూచించారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమకు చదువు చెప్పిన గురువులు కేశవరెడ్డి, నిర్మలను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ధనపాల్, అపరంజి రాజు, పరమేశ్వరం, ఎంపీటీసీ శ్రీజ బాలాజీ నాయుడు, టిడిపి నాయకులు రవినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో ఆదివారం ఇంజనీర్స్ డేను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు రవిచంద్ర అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీంద్ర బాబు హాజరైయ్యారు. ఆయన మాట్లాడుతూ యువ ఇంజనీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకొని తమ ప్రతిభతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పాటుపడాలని కోరుచూ విశ్వేశ్వరయ్య సేవలను కొనియాడారు. ఆర్డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్తార్ హుస్సేన్ మాట్లాడుతూ మోక్షగుండం దేశానికి ఎనలేని సేవ చేశారని ఆ సేవను గుర్తించి భారతదేశ అత్యున్నత పునస్కారం భారతరత్న వారికి ఇవ్వడం జరిగిందని తెలిపారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్, అధికారులు నంద కుమార్, ముని కుమార్, వి.వి.దయాళ్, ప్రసాద్, మురళి రెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరాయ 163వ జయంతి (ఇంజనీర్స్ డే) సందర్భంగా స్థానిక లైసెన్స్ ఇంజనీర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ లైసెన్సుడ్ ప్లానర్ అండ్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ప్రపంచ ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుమలకు వెళ్లే యాత్రికులకు సులభతరమైన బస్సు ప్రయాణం మార్గం మొదటి ఘాట్ రోడ్‌కు రూపశిల్పి మోక్షగుండం విశ్వేశ్వరాయ సేవలు చిరస్మరణీయమని సంస్థ అధ్యక్షులు డబ్ల్యుయం భక్తవత్సలం కొనియాడారు. టీటీడీ యాజమాన్యం వారి సేవలను గుర్తిస్తూ ఈ సందర్భంగా అలిపిరి వద్ద మోక్షగుండం విశ్వేశ్వరాయ కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టించవలసిందిగా డిమాండ్ చేశారు. స్థానిక నగరపాలక సంస్థ వద్ద పేదలకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు, శేషాద్రి, అనీశ్వర్, రవీంద్రనాథ్, దామోదరం, స్రవంతి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

టేప్ ఆధ్వర్యంలో..

ది అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్ అండ్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో స్థానిక బైరాగి పెట్టడంలోని గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. టేప్ అధ్యక్షులు మట్లి ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన ఇంజనీర్స్ డే జరిగింది. ముఖ్యఅతిథిగా తుడా ముఖ్య ప్రణాళిక అధికారి దేవి కుమారి, ప్రముఖ రచయిత కోట పురుషోత్తం హాజరైయ్యారు. భారతరత్న విశ్వేశ్వరయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వాసన్ ఐ కేర్ వారి సౌజన్యంతో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి టేప్ చైర్మన్ వెంకటేష్ బాబు, వైస్ ప్రెసిడెంట్ పి.నాగేశ్వరరావు, సెక్రెటరీ బుసా షణ్ముగం, ట్రెజరర్ సుధాకర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శివశంకర్ రెడ్డిర, జాయింట్ సెక్రెటరీ రఘురాం రెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ సురేష్, శ్రీనివాసులు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోక్షగుండం సేవలు ఆదర్శనీయం

- ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కె. సంతోష రావు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: నేటి ఇంజనీర్లకు మోక్షగుండం



తిరుపతిలో

విశ్వేశ్వరాయ సేవలు ఆదర్శనీయమని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష రావు పేర్కొన్నారు. ఎపి ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఆదివారం మోక్షగుండం విశ్వేశ్వరాయ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి సంతోషరావు మాట్లాడుతూ మోక్షగుండం ఇంజనీర్‌గా అనేక నిర్మాణాత్మక పనులను చేపట్టి ప్రజల మదిలో శాశ్వతంగా నిలిచారన్నారు. ఆయన పేద కుటుంబంలో జన్మించినప్పటికీ నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తూ సమాజాభివృద్ధిలో మరపురాని పాత్రను పోషించారన్నారు. పనినే దైవంగా భావిస్తూ రోజుకు 18 గంటలపాటు పనిచేసిన ఆయనను అప్పట్లో భారత ప్రభుత్వం భారతరత్న బిరుదుతో గౌరవించడం గొప్ప విషయమన్నారు. దేశంలోని 8 విశ్వవిద్యాలయాలు ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసి గౌరవించాయని అన్నారు. విద్యుత్ రంగ ఇంజనీర్లు మోక్షగుండం అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్, ప్రాజెక్ట్స్ (ఎఫ్ఎసి) పి.అయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్‌డి) జె.రమణాదేవి, జనరల్ మేనేజర్లు రామచంద్రరావు, మురళి, భాస్కర్ రెడ్డి, వెంకటరాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

23 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ ముత్తయ్య తెలిపారు. ఆదివారం ఆయన స్థానికల విలేకరులకు వివరాలు వెల్లడించారు. ముందస్తుగా అందిన సమాచారంతో ఆదివారం మండలంలోని ఆలత్తూరు క్రాస్ రోడ్డు వద్ద సోదాలు నిర్వహించామన్నారు. కారులో గంజాయి తరలిస్తున్నట్లు అనుమానంతో తహశీల్దార్ సుబ్రమణ్యం, ఎస్ఐ విశ్వనాథ్ నాయుడు, తమ సిబ్బందితో కలిసి దాడి చేసి వాహనాన్ని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. అందులో 23కేజీల గంజాయిని గుర్తించి, నిందితులు దిలీప్, మహబూబ్ బాషాలను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. పట్టుబడ్డ గంజాయి రూ.25లక్షల విలువ ఉంటుందని అంచనా వేశారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, అరుణ్, మణి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడు దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: ట్రాక్టర్ ఢీకొట్టి ఓ యువకుడు దుర్మరణం పాలవగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డ సంఘటన మండలంలోని జగ్గరాజు పల్లి వద్ద ఏర్పేడు-వెంకటగిరి జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. సిఐ రవి నాయక్ కథనం మేరకు.. యల్లంపల్లి గ్రామానికి చెందిన మోడుబోయిన వెంకటేష్(19) తన మిత్రుడు జయకుమార్(21)తో కలిసి ద్విచక్ర వాహనంలో వ్యక్తిగత పనుల నిమిత్తం వెంకటగిరికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో జగ్గరాజు పల్లి వద్ద డాక్టర్ ఢీ కొట్టడంతో వెంకటేష్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. తీవ్రంగా గాయపడ్డ జయకుమార్‌ను స్థానికులు 108ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

భారీగా ఎర్రచందనం స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి మంగళం: శేషాచల అటవీ ప్రాంతంలోంచి అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని ముగ్గురుని అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. ఆర్ఎస్ఐ లింగాధర్, విశ్వనాథ్‌ల బృందాలు స్థానిక అటవీ అధికారుల సహకారంతో ఆదివారం ఉదయం మంగళం వైపున కూంబింగ్ చేపట్టారు. మంగళంలో ఒక సూపర్ మార్కెట్ సమీపంలో టవేరా వాహనంలో ఎర్రచందనం లోడ్ చేయడాన్ని గుర్తించి చుట్టుముట్టే ప్రయత్నం చేశారు. అక్కడి నుంచి కొందరు తప్పించుకొని పారిపోగా ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంఘటనా స్థలంలో 38ఎర్రచందనం దుంగలు, ఒక కారు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కాగా పట్టుబడ్డ వారిలో తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన ఇద్దరు, తిరువన్నామలై జిల్లాకు చెందిన ఒకరు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ

- ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు యువకులు గాయాలపాలైన సంఘటన ఆదివారం నారాయణవనం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పిచ్చాటూరు మండల వేలూరు సర్పంచ్ శేఖర్ తనయుడు డేవిడ్ మార్క్, నారాయణవనం మండల బ్రాహ్మణ తాంగల్ పంచాయతీ వడ్డిండ్లకు చెందిన బాలాజీలు నారాయణవనం కూడలి వద్దనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద వేర్వేరు బైక్‌లపై వచ్చారు. ఎదురెదురుగా వచ్చిన బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో డేవిడ్ మార్క్‌కి స్వల్ప గాయాలు కాగా బాలాజీకి తీవ్ర గాయాలు కాగా తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి కత్తిపోట్ల ఘటనలో వెలుగులోకి ఆసక్తికర విషయాలు

- ప్రియుడి హత్యకు సినిమా స్టైల్లో స్కెచ్
- మాజీ ప్రియుడుతో కొత్త ప్రియుడుపై దాడి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: సూళ్లూరుపేటకు చెందిన కావ్య అనే యువతి, తన సమీప బంధువు తడకు చెందిన కార్తీక్ అనే యువకుడిని ప్రేమించింది. పదో తరగతి వరకు చదువుకున్న కార్తీక్ జులాయిగా తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో రెండు సంవత్సరాల క్రితం కావ్య చదువు రిత్యా తిరుపతి సమీపంలోని మోహన్ బాబు యూనివర్సిటీలో బిఎస్సి పారామెడికల్ కోర్సులో జాయిన్ అయింది. అదే కళాశాలలో తనతో పాటు చదువుకుంటూ తిరుపతి సత్యనారాయణపురంలో ఉంటున్న ప్రకాశం జిల్లా గిద్దలూరుకి చెందిన లోకేష్‌తో ప్రేమాయానం సాగించింది. ఈ విషయం తెలుసుకున్న పాత ప్రియుడు కార్తీక్ ఆమె నిలదీయడంతో, లోకేష్ ప్రేమ పేరుతో తన వెంటబడి వేధిస్తున్నాడని నమ్మించింది. ఇటీవల వినాయక చవితి రోజు కార్తీక్‌తో కలిసి తిరుగుతున్న కావ్యాను లోకేష్ గమనించాడు. దీనిపై ఆయన నిలదీయడంతో అయన తన బావ అంటూ నమ్మబలికింది. లోకేష్‌కి విషయం తెలియడంతో ఎలాగైనా అతన్ని తప్పించాలని నిర్ణయించుకుంది. లోకేష్ బారి నుంచి తనను కాపాడాలని కార్తీక్‌తో మొరపెట్టుకోవడంతో హతమార్చేందుకు పాత ప్రియుడుతో కలిసి పథకం వేశారు. లోకేష్‌తో ఫోన్లో మాట్లాడిన కావ్య, శనివారం మధ్యాహ్నం పిజిఆర్ థియేటర్లో ఇద్దరికి కలిసి ఆన్లైన్లో రెండు టికెట్లు బుక్ చేసింది. అదే షోకి తమ వెనుక వరుసలో సీటు వచ్చేలా కార్తీక్‌కు మరో టికెట్టు బుక్ చేసి రహస్యంగా ఉంచింది. పాత ప్రియుడు కార్తీక్‌తో కలిసి సినిమా థియేటర్ సమీపం వరకు వచ్చిన కావ్య, ఏమీ ఎరగనట్లు ఒంటరిగా థియేటర్ వద్దకు వచ్చి లోకేష్‌తో కలిసి సినిమా థియేటర్‌లోకి వెళ్లింది.

వారు వెనకే కార్తీక్ కూడా థియేటర్లోకి ప్రవేశించి వెనక వరుసలో కూర్చున్నాడు. సినిమా ప్రదర్శిస్తున్న సమయంలో ప్రేక్షకులందరూ సినిమాని దీర్ఘంగా చూస్తున్న వేళ, తమను ఎవరు చూడలేదని భావించిన కార్తీక్ ముందుగానే తనతో తెచ్చుకున్న కత్తితో వెనక వైపు నుంచి లోకేష్‌ని పొడిచాడు.

వెనువెంటనే కావ్యను తీసుకొని థియేటర్ నుంచి పారిపోయాడు. థియేటర్ పక్కనే ఉన్న బస్టాండ్‌కి వెళ్లి కావ్యను సూళ్లూరుపేటకు బస్సు ఎక్కించి, తను బైక్‌లో బయలుదేరి వెళ్లిపోయాడు. కత్తి గాయాలతో రక్తమోడుతున్న లోకేష్, థియేటర్ నుంచి వెలుపలకు వచ్చి బాత్రూంకి వెళ్లి శుభ్రం చేసుకుంటుండగా, థియేటర్ సిబ్బంది గమనించి ఆసుపత్రికి తరలించి పోలీసులు సమాచారం ఇచ్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లోకేష్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. లోకేష్‌పై కత్తితో దాడి చేసిన యువతీ యువకుల కోసం, ఈస్ట్ పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపడుతున్నారు. ఏది ఏమైనా ఓ యువతి ఇద్దరి మధ్య తగాదాలను సృష్టించి, కారణం అయిన ఘటనపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

సురేష్‌కు రచయితల సత్కారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఇటీవల డిల్లీలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులు, పాఠ్యపుస్తక రచయిత, సాంకేతిక నిపుణులు, కూనాటి సురేష్‌కు ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రచయితలు గొడుగుచింత గోవిందయ్య, యువశ్రీ మురళి, తీగల వెంకటయ్య మాట్లాడుతూ సురేష్ మన ప్రాంతవాసిగా మట్టిలో మాణిక్యంగా పల్లెటూరి నుండి జాతీయ స్థాయి వరకు తెలుగువారి కీర్తిని చాటిచెప్పారని కొనియాడారు.

26 నుంచి ఉరుసు గంధోత్సవం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు హజరత్ ఖవాజా సయ్యద్ షా జలేషా పీర్ చిస్తీయుల్ ఖాదరీ వలి ఉరుసు వార్షిక గంధోత్సవంను నిర్వహిస్తున్నట్లు ఉరుసు నిర్వాహక కమిటీ తెలిపింది. ఉరుసు గంధోత్సవం విజయవంతంపై ఆదివారం స్థానిక పానగల్ జులేషా పీర్ దర్గా వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. దర్గా పెద్దలు జహంగీర్ బాషా మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా కొన్ని అనివార్య కారణాలవల్ల ఉరుసు గంధోత్సవాలు జరగలేదని, ప్రస్తుతం అనుకూలవాతావరణం ఉన్న నేపథ్యంలో హిందూ - ముస్లింలంతా ఒక్కటిగా ఉరుసు గంధోత్సవం జరపాలని పిలుపునిచ్చారు. బాబా ఫరీద్, ఉరుసు కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, సయ్యద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలు, గుడ్లు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల భవనంలో గుర్రం విజయ్ బాబు దాతృత్వంలో 20మంది దివ్యాంగులకు మయూరి శ్యామ్ యాదవ్ చేతుల మీదుగా కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. మయూరు శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ జేవివి వారు ఎన్నో మంచి సేవా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమానికి దాతగా వ్యవహరించిన గుర్రం విజయ్ బాబును అభినందించారు. కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, నాగరాజు, రాదయ్య, మధుసూదన్, పవన్ కుమార్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస ఆచారి, జగదీష్, సురేష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం అందజేత



ప్రజాశక్తి-గూడూరు టౌన్: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు పట్టణానికి చెందిన పలువురు విరాళాలు అందజేశారు. ఆదివారం గూడూరులో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ని ఆయన నివాసంలో కలిసి విరాళపు సొమ్మును అందజేశారు. పట్టణానికి చెందిన ల్యాండ్ డెవలపర్స్ సత్యంజీ గ్రూప్ వారు గోపిశెట్టి ఆనంద్ రూ.లక్ష, హరిబాబు రూ.25వేలు, వెటర్నరీ డాక్టర్ సురేష్ రూ.25 వేల చెక్కును ఎమ్మెల్యేకు అందించారు. వరద బాధితులను ఆదుకోవడానికి సామాన్యులు సైతం ముందుకు వచ్చి విరాళాలు ఇచ్చి ఆదుకోవడం అభినందనీయం అని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో సోమిశెట్టి సాయి కృష్ణ, హరి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'ఏపీఆర్‌డీ సంస్థ సేవలు అభినందనీయం'

ప్రజాశక్తి-గూడూరుటౌన్: నిరుపేదలు ఇల్లు నిర్మించుకొనేందుకు ఆర్థిక సాయం అందజేయడం కోసం ఏపీఆర్‌డీ సంస్థ ముందుకు రావడం అభినందనీయం అని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. చిట్టమూరు మండలానికి చెందిన బాలకృష్ణకు ఏపీఆర్‌డీ సంస్థ ద్వారా ఇల్లు నిర్మాణం కోసం రూ.10లక్షలు ఎంపిక చేశారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆ సంస్థ కోఆర్డినేటర్ ప్రియాంక బాలకృష్ణకు రూ.10లక్షలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. మరో వారంలో ఐదు గురిని ఎంపిక చేసి ఆర్థిక సాయం అందిస్తామని ఆమె తెలిపారు. సేవా కార్యక్రమాలు చేపడుతున్న సంస్థను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందనీయం అన్నారు.